క్లుప్తంగా

కాకాణితో విక్రమ్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి భేటీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి సమన్వయ కర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

వినియోగదారులకు అవగాహన



మాట్లాడుతున్న ఎస్‌ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ ప్రమాదాలు అరికట్టేందుకు వినియోగదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ ఆదేశించారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి తప్పిదాల వల్ల విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఐఎస్ఐ నాణ్యత కలిగిన వైర్లు, స్విచ్‌లు మాత్రమే వాడాలన్నారు. తడిచేతులు, కాళ్లతో స్విచ్‌లు వేయకూడదన్నారు. మిద్దెలపై, ఇళ్ల నిర్మాణ పనులు జరిగే సమయంలో విద్యుత్ లైన్లు సమీపంలో ఉంటే సిబ్బందికి తెలియజేసి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏదైనా ప్రమాదం జరిగిన సమయంలో నేరుగా విద్యుత్ పరికరాలను, షాక్‌కు గురైన వ్యక్తిని తాకకూడదన్నారు. సంబంధిత అధికారి, సిబ్బందికి తెలియజేయాలని కోరారు. సిబ్బంది హెచ్‌టీ, ఎల్‌టీ విద్యుత్ లైన్లలో మరమ్మతులు చేసే సమయంలో పక్కాగా లైన్ క్లియర్ (ఎల్‌సీ) తీసుకోవాలన్నారు.

పేదలకు అన్నదానం



నెల్లూరు(బృందావనం): మొహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని బారకాసు సెంటర్‌లోని హజరత్ ఖాదర్ ఔలియా నిషాన్ వద్ద సోమవారం పేదలకు అన్నదానం చేశారు. రాష్ట్ర ముస్లిం నేత సంగం షఫీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు సమీ, షబ్బీర్, మున్వర్, సాలార్, ఎస్ఆర్ ఇలియాజ్, జుబేర్, మంజూర్, మస్తాఖ్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(పొగతోట) : నగరంలోని మూలాపేట ఈఎస్ఆర్ఎం స్కూల్ సమీపంలో కలెక్టర్ ఆనంద్ సామాజిక పింఛన్లను సోమవారం పంపిణీ చేశారు. మంచానికే పరిమితమైన డయాలసిస్ రోగి సిరివెళ్ల శ్రీనివాస్‌కు రూ.15 వేలు, ఒంటరి మహిళ పింఛన్ పొందుతున్న శారదకు రూ.4 వేల పింఛన్‌ను పంపిణీ చేసి వారి ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ స్వయంగా ఇంటికి వచ్చి పింఛన్లు అందించడం పట్ల కుటుంబసభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సచివాలయ అధికారులు పి.వాసంతి, రజని, స్వచ్ఛంద, మురళి ఉన్నారు.

➡ నెల్లూరు సిటీ: నగరంలోని నాలుగో డివిజన్ దీనదయాల్ నగర్‌లో మంత్రి పొంగూరు నారాయణ సోమవారం సామాజిక పింఛన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ విజేతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లంబోదర లడ్డూ @ రూ.13.50 లక్షలు



నెల్లూరు(బృందావనం) : మినీబైపాస్ రోడ్డులోని బెజవాడ గోపాల్‌రెడ్డి జంక్షన్ వద్ద మాగుంట లేఅవుట్ లంబోదర సెంటర్ లడ్డూను వేలంపాటలో రూ.13.50 లక్షలకు తేజశ్విని గ్రాండ్, తేజు డెవలపర్స్ అధినేత తోట శ్రీనివాసులురెడ్డి దక్కించుకొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం లడ్డూను స్వీకరించారు.

మినరల్ మాయ

- వాటర్ ప్లాంట్ల నిర్వహణపై అనేక సందేహాలు
- ఐఎస్ఐ ధ్రువీకరణ లేకుండానే నీటి అమ్మకం
- రుచికోసం కెమికల్స్ కలుపుతున్న వైనం



నగరంలోని ఓ ప్రాంతంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్

నెల్లూరు(బారకాసు): నగర ప్రజలు మినరల్ వాటర్‌కు పూర్తిస్థాయిలో అలవాటు పడిపోయారు. దీంతో నగరంలో వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తూనే ఉన్నాయి. ఇప్పటికే దాదాపు 300 వరకు ప్లాంట్లు వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నాయి. కానీ దాదాపు అన్ని ప్లాంట్లలో కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. పేరుకే మినరల్ వాటర్.. అయితే అంతర్జాతీయ ప్రమాణాలను మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇలాంటి నీటిని తాగితే జుట్టు రాలిపోవడం, అతిసార, కిడ్నీ సంబంధిత వ్యాధులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

లెక్కకు మించిన ప్లాంట్లు

అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రతి మనిషికి రోజుకు 10 లీటర్లకు తగ్గకుండా తాగునీటిని సరఫరా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. ఈ లెక్కన నగరపాలక సంస్థ పరిధిలోని దాదాపు 8 లక్షల జనాభాకు లక్షలాది లీటర్ల నీరు కావాలి. దీంతో వాటర్‌ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

చౌకగా ప్లాంట్ల నిర్మాణం

అన్ని ప్రమాణాలు పాటించి మినరల్ వాటర్ అందించాలంటే భారీ వ్యయం చేయాల్సిందే. కానీ నగరంలో చాలా చోట్ల కేవలం రెండు నుంచి మూడు లక్షల రూపాయలతో చిన్నచిన్న వాటర్ ప్లాంట్లు వెలుస్తుండడం గమనార్హం. వీరు బోరు వేయించిన తర్వాత ప్లాస్టిక్ ట్యాంకులను కొనుగోలు చేస్తున్నారు. అతి చౌకగా ప్యూరిఫైడ్ మిషనరీ తీసుకుని నీటిని శుద్ధి చేస్తున్నారు. సోడియం, కార్బొనేట్, సోడియం క్లోరైడ్, శాక్రిన్ కలిపి నీటికి రుచి తెస్తున్నారు. తర్వాత యథేచ్ఛగా విక్రయిస్తున్నారు.

ఇష్టమొచ్చిన రేట్లకు అమ్మకాలు

నిబంధనలు పట్టించుకోకుండా నీటిని ప్యాక్ చేయడమే కాకుండా రేట్లను కూడా ఇష్టానుసారంగా విధిస్తున్నారు. 20 లీటర్ల నీటిని రూ.10 నుంచి రూ.20ల వరకు విక్రయిస్తున్నారు. 200 వాటర్ ప్యాకెట్లున్న బ్యాగును రూ.50కి విక్రయిస్తుండగా.. విడిగా ఒక్కో ప్యాకెట్ రెండు రూపాయలకు అమ్ముకుంటున్నారు. నగరంలో మొత్తమ్మీద నీటి వ్యాపారం టర్నోవర్ కోటి రూపాయలకు పైగానే ఉండొచ్చని అంచనా.

నిబంధనలిలా ఉన్నాయి..

➡ ప్లాంట్‌కు కనీసం 2,200 చదరపు మీటర్లు కేటాయించి నిర్మాణం చేపట్టాలి.

➡ నీటిని నిల్వ ఉంచేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యాంకులనే వాడాలి.

➡ పంపింగ్ చేసేటప్పుడు కూడా స్టెయిన్‌లెస్ స్టీల్ పైపులనే ఉపయోగించాలి.

➡ అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం ఉన్న రివర్స్ ఆస్మాసిస్ ప్రక్రియ ద్వారా నీటిని శుభ్రపరచాలి.

➡ బీఐఎస్ నిబంధనలకు అనుగుణంగా వాటర్ ప్లాంట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి.

ప్రమాణాలు పాటించకుంటే చర్యలు



ప్రభుత్వ నిబంధనల మేరకే మినరల్ వాటర్‌ను విక్రయించాలి. అలా కాకుండా ఇష్టానుసారంగా మినరల్ వాటర్‌ను విక్రయిస్తే మాత్రం చర్యలు తప్పవు. ప్రమాణాలు పాటించకుంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ చైతన్య , ఎంహెచ్‌ఓ, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్

ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన కల్పించండి

- కమిషనర్ నందన్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): అనధికార, అక్రమ లేఅవుట్లలోని ప్లాట్ల యజమానులు హక్కులను పొందేందుకు ఎల్‌ఆర్‌ఎస్ మార్గదర్శకాలపై అవగాహన కల్పించి, సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం నిర్వహించారు. కమిషనర్ పాల్గొని, వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనధికార, అక్రమ నిర్మాణాలను గుర్తించి నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి రోడ్డు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, మార్టిగేజ్ విడుదల, అలాగే ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రోడ్లు, కాలువల నిర్మాణం, సివిల్ వర్కులు, వీధిదీపాల ఏర్పాటు తదితర సమస్యలకు సంబంధించి అర్జీలను అందుకున్నామని తెలిపారు. అదేవిధంగా రెవెన్యూ విభాగం నుంచి అసెస్మెంట్ మార్పులు, నూతన ఇంటి పన్ను దరఖాస్తులు, ఇంటి పన్నులో మార్పులు తదితర అంశాలపై ఫిర్యాదులు స్వీకరించామన్నారు.

మొత్తం వినతులు 51

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మొత్తం 51 వినతులు అందుకున్నామని కమిషనర్ నందన్ వెల్లడించారు. విభాగాల వారీగా ఇంజినీరింగ్–4, హౌసింగ్–18, టౌన్ ప్లానింగ్–10, రెవెన్యూ–9, పబ్లిక్ హెల్త్–4, ఆప్కాస్–5, అకౌంట్ సెక్షన్–1 చొప్పున అర్జీలు స్వీకరించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్మోహన్ రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, సిటీ ప్లానర్ హిమబిందు, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అద్దె బకాయిదారులపై కొరడా



దుకాణాన్ని సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థకు చెందిన దుకాణాల్లో అద్దె చెల్లించకుండా దీర్ఘకాలంగా బకాయిలున్న వారిపై ఎన్ఎంసీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. స్థానిక చిన్నబజార్ ప్రాంతంలోని ఏసీ సుబ్బారెడ్డి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో పదో నంబర్ షాపు నిర్వాహకుడు రూ.50 వేల బకాయి ఉన్నందున చాలాసార్లు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో సోమవారం చర్యలకు ఉపక్రమించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు సీవీఎస్ కిరణ్, వరప్రసాద్‌ల ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో కలిసి పదో నంబర్ షాపును సీజ్ చేశారు.

పన్ను బకాయిల రద్దుకు డిమాండ్



నిరసన చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డి కాలనీ వాసులకు ఇంటి పన్ను బకాయిలను వెంటనే రద్దు చేయాలని, ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ స్థానిక సచివాలయం వద్ద సోమవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా మాట్లాడుతూ ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు 30 ఏళ్లకు ఒకేసారి ఇంటి పన్ను వేయడం దారుణమన్నారు. కనీస సౌకర్యాలైన తాగునీరు, సైడు కాలువలను ఏర్పాటు చేయకపోగా 30 సంవత్సరాలకు ఒకేసారి వడ్డీతో సహా ఇంటి పన్ను చెల్లించాలని నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. పన్ను చెల్లించకపోతే కరెంట్, నీటి సరఫరాను నిలిపివేస్తామని సచివాలయ సిబ్బంది బెదిరించడం సరికాదని, ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే కార్పొరేషన్ కార్యాలయంతో పాటు, మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు షాన్‌వాజ్, లీలామోహన్, బాదుల్లా, షబ్బీర్, గౌస్‌బాషా, వాసుదేవరెడ్డి, మనోహర్, షాజహాన్, సాయి, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా ఏఆర్‌టీ, సరోగసి చట్టం

నెల్లూరు (అర్బన్): జిల్లాలో ఏఆర్‌టీ, సరోగసి–2021 చట్టం ప్రకారం నిర్వాహకులు నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలని డీఎంహెచ్‌ఓ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చట్టం కింద గర్భాశయ గర్భధారణ, ప్రయోగ శాలలో ఫలదీకరణ, వీర్యం, అండాలను భద్రపరుచుట, అద్దె గర్భం (సరోగసి) క్లినిక్‌లు నిర్వహించేందుకు నిర్ణీత ఫీజు చెల్లించి నేషనల్ రిజిస్ట్రీ పోర్టల్‌లో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనుమతులు పొందకుండా చికిత్స అందిస్తే అలాంటి డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటి వరకు ఈ చట్టం ప్రకారం 9 మంది వైద్యులు ఏఆర్‌టీ క్లినిక్ లెవల్–1 కింద, 12 మంది లెవల్–2 కింద, ఒకరు సరోగసి క్లినిక్ నిర్వహించుకునేందుకు అనుమతి పొందారని, చట్టం పరిధిలోనే చికిత్స అందించాలని సూచించారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని రంగనాథస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలకు అంకురార్పణను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు పవిత్ర ప్రతిష్ఠ, తదుపరి తిరుమంజనం, మహాకుంభారాధన, ఆదివాసం, పవిత్ర సమర్పణ తదితర పూజా కార్యక్రమాలను జరుపనున్నట్లు ఈఓ తెలిపారు.

సత్తాచాటిన కేంద్రియ విద్యార్థులు



ప్రథమ స్థానం కైవసం చేసుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్

నెల్లూరు సిటీ: కొత్తూరులోని కేంద్రియ విద్యాలయానికి చెందిన 55 మంది విద్యార్థులు ఓ జట్టుగా ఆగస్టు 30న విశాఖపట్నంలో జరిగిన యువ పార్లమెంట్ పోటీలో సత్తా చాటినట్లు ప్రిన్సిపల్ కట్టా శంకరయ్య తెలిపారు. ఇందులో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న వారిని సోమవారం పాఠశాలలో అభినందించారు. అక్టోబర్ మొదటి వారంలో జోనల్ స్థాయి పోటీలు జబల్‌పూర్‌లో జరుగుతాయన్నారు. వారికి శిక్షణ ఇచ్చిన ఈవ, జోషిబాబు, మంజీత్, అనిల్, మీనాల కృషి అభినందనీయమన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ



లార్వా సర్వేను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా నివారణాధికారి

నెల్లూరు(అర్బన్): జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ నగరంలోని స్నేహనగర్‌లో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. ల్యాబ్ టెక్నీషియన్‌లు చేసిన రక్తపరీక్షల రిజిస్టర్‌లను పరిశీలించారు. జ్వరాలకు సంబంధించి మలేరియా, డెంగీ లాంటి పరీక్షలను పెంచాలని సూచించారు. అనంతరం వనంతోపులో జరుగుతున్న లార్వా సర్వేను పరిశీలించారు. ఆశా కార్యకర్తలు ప్రతిరోజూ లార్వా సర్వే, ఫీవర్ సర్వే చేయాలని సూచించారు. తర్వాత స్థానికులకు దోమల వల్ల కలిగే జబ్బుల గురించి అవగాహన కల్పించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఐశ్వర్య రాజ్యలక్ష్మి, ఆరోగ్య సహాయకుడు శ్రీనివాసులురెడ్డి, ఏఎన్ఎంలు సుజాత, వసిహా తదితరులు పాల్గొన్నారు.

బీవీనగర్‌లో అగ్నిప్రమాదం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : బీవీనగర్‌లోని సంఘమిత్ర వీధిలో ఆదివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. స్థానిక విద్యుత్ స్తంభం వద్ద చెత్తను తగులబెట్టడంతో మంటలు ఎగసిపడి విద్యుత్ స్తంభానికి ఉన్న డిష్‌వైర్లకు మంటలు వ్యాపించాయి. ఈ సమయంలో ప్రజల సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రాంతంలో చెత్త కుండీలు లేకపోవడంతో కొందరు స్థానికులు విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్తను వేయడం, తగులబెట్టడం చేస్తున్నారు. దీనికి తోడు విద్యుత్ స్తంభాలకు అనుమతి లేని డిష్‌వైర్లు ఏర్పాటు చేయడం వల్ల నిత్యం అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని, విద్యుత్‌శాఖ అధికారులు డిష్‌వైర్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రాజరాజేశ్వరి దేవస్థానంలో స్తంభ ప్రతిష్ట రేపు

నెల్లూరు(బృందావనం): కరెంటాఫీస్ సెంటర్ దగ్గర ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాల నిర్వహణకు సంబంధించి స్తంభ ప్రతిష్ఠ బుధవారం ఉదయం ఉంటుందని దేవస్థానం ఈఓ జనార్ధన్‌రెడ్డి సోమవారం తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

డిసెంబర్ నాటికి పార్కుల అభివృద్ధి

నెల్లూరు సిటీ: డిసెంబర్ నాటికి అన్ని పార్కులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని మైపాడు గేటు సెంటర్‌లో స్మార్ట్ స్ట్రీట్ కంటైనర్ల ఏర్పాటును, బోడిగాడితోటలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పార్కు పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు నివాసం ఉండే బోడిగాడితోటలో అన్ని హంగులతో పార్కును సిద్ధం చేస్తున్నామన్నారు. కార్పొరేషన్ కమిషనర్ నందన్, టీడీపీ నగరాధ్యక్షులు మామిడాల మధు పాల్గొన్నారు.

నేత్రదానాన్ని ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి శార్వాణి

నెల్లూరు(అర్బన్): తాను మరణించి కూడా మరో ఇద్దరికి వెలుగును ప్రసాదించే నేత్రదానాన్ని ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ శార్వాణి అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా బుజబుజనెల్లూరులోని డీవీఎస్ఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పీఎంపీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శార్వాణి మాట్లాడుతూ దేశంలో లక్షలాది మంది చూపులేక చీకటి బతుకు జీవిస్తున్నారన్నారు. అలాంటి వారికి జీవితాన్ని ప్రసాదించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. నేత్రదానాన్ని మరణానంతరమే స్వీకరిస్తారని, అన్ని మతాల వారు నేత్రదానాన్ని ఆమోదించాలన్నారు. అనంతరం పీఎంపీ నాయకులు, ఉపాధ్యాయులు డాక్టర్ శార్వాణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరమణ, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, కోశాధికారి దేవరకొండ శ్రీనివాసులు, కె.రామరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారిగా శ్రీనివాసులు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారిగా శ్రీనివాసులును నియామకం చేస్తూ కలెక్టర్ ఆనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారిగా ఇప్పటి వరకు విధులు నిర్వహిస్తున్న పీబీకే పరిమళ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై పాడేరుకు బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో ఏపీఎంఐపీ పీడీగా ఉన్న బి.శ్రీనివాసులును ఇన్‌చార్జి అధికారిగా నియమించారు.

బీజేపీ నేతల నిరసన



నెల్లూరురూరల్: ప్రధాని నరేంద్ర మోదీ తల్లిపై కాంగ్రెస్ పార్టీ నేత అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ బీజేపీ నేతలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం వరకు నిరసన చేపట్టి రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కరణం సుభాషిని, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిపారెడ్డి వంశీధర్‌రెడ్డి, పార్టీ నేతలు కర్నాటి ఆంజనేయరెడ్డి, యశ్వంత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణలు చెప్పాలి

కాంగ్రెస్ పార్టీ నేత అనుచిత వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణలు చెప్పాలని బీజేపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దీనిని ఇప్పటివరకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు ఖండించకపోవడం బాధాకరమన్నారు.

బీఎల్‌ఏలతో ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరుసిటీ: రూరల్ నియోజకవర్గ బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్‌ఏ)లతో వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, పలు అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నెల్లూరు సిటీ: నగరంలో 47 మందికి రూ.49.37 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ సోమవారం తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంలో నగరంలో 183 మందికి రూ.2.15 కోట్ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.